క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మందమర్రిరూరల్: మండలంలోని అందుగులపేట 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్‌లలో మరమ్మతులు, లైన్‌కు తాకుతున్న చెట్ల కొమ్మలను కొట్టివేస్తున్న కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ మల్లేశం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జీఎం ఆఫీస్, యాపల్, కేకే–2 ఏరియాలు, ఊరు మందమర్రి, ఎర్రగుంటపల్లె, మార్కెట్ ఏరియా, దీపక్‌నగర్, శ్రీపతినగర్, దొరలబంగ్లాస్ ఏరియా, అందుగులపేట, ఆర్లాపూర్, పులిమడుగు, బొక్కలగుట్ట, కోటేశ్వరరావుపల్లె, సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

కాసిపేట: మండలంలోని అన్ని గ్రామాలకు మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ స్వర్ణలత తెలిపారు. కొండాపూర్ 33కేవీ, మందమర్రి ఫీడర్‌లలో మరమ్మతులు ఉన్నందునా కాసిపేట మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులందరూ సహకరించాల్సిందిగా కోరారు.

చిత్తరాయి గుట్టల పర్యవేక్షణ



చిత్తరాయి గుట్టను పర్యవేక్షిస్తున్న ఎఫ్ఆర్‌ఓ

సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం ధర్మారం శివారులోని అటవీ ప్రాంతంలో గల చిత్తరాయి గుట్టలపై ఆదివారం 'సాక్షి' దినపత్రికలో 'చిత్తరాయి గుట్టలను సంరక్షించాలి' అనే శీర్షికన వచ్చిన కథనంపై అటవీ అధికారులు స్పందించారు. హాజీపూర్ గ్రామ పరిధిలోని ధర్మారం అటవీ ప్రాంతంలోని చిత్తరాయి గుట్టలను సోమవారం ఎఫ్ఆర్ఓ నాగవత్ స్వామి, ఎఫ్‌బీఓ ఉష ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. అడవిలో ఉన్న చిత్తరాయి గుట్టలను, అక్కడ ఉన్న ఆదిమానవ కాలం నాటి చిత్రకుడ్యాలను, పలు విగ్రహాలను పరిశీలించారు. చారిత్రక నేపథ్యం ఉందా లేదా అనే కోణంలో విచారణ జరిపి ధృవీకరించిన మీదట ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎఫ్ఆర్ఓ నాగావత్ స్వామి ఈ సందర్భంగా 'సాక్షి'కి తెలిపారు.

అక్రమ కట్టడం కూల్చివేత

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ గ్రామపంచాయతీలోని చెరువు కట్టపై కడుతున్న ఓ అక్రమ కట్టడాన్ని సోమవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ఆర్ఐ కిషన్, గ్రామపంచాయతీకి చెందిన ప్రభుత్వ భూమిలో ఎలాంటి కట్టడాలు చేపట్టొద్దని పేర్కొంటూ బోర్డును పాతిపెట్టించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కట్టడాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ చెర్కు దీపికా రెడ్డి

భీమారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ చెర్కు దీపికారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దీపికారెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను విధిగా అంగన్‌వాడీకేంద్రాల్లో చేర్పించాలని కోరారు. పిల్లలకు పోషకాహార లోపం లేకుండా ప్రభుత్వం పెద్ద ఎత్తున అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసి అందులో పిల్లలకు బలవర్ధకమైన ఆహారం అందిస్తున్నారని తెలిపారు. వివిధ శాఖల అధికారులు ఈ విషయంలో ప్రజలకు నచ్చజెప్పి అంగన్‌వాడీలకు పంపేలా చూడాలని కోరారు. గ్రామాల్లో మిషన్‌భగీరథ నీటిని పూర్తి స్థాయిలో అందేలా చూడాలని ఎంపీటీసీ పెద్దల రూప కోరారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా భగీరథ నీటి సరఫరా జరుగుతుందని, అయితే కొన్నిచోట్ల ఇబ్బందులు ఉన్నాయన్నారు. అన్ని వీధుల్లో పైపులైన్లు వేసి, నీటి సరఫరా చేయాలని కోరారు. ఎలక్షన్ కోడ్ నేపథ్యంలో ఎలాంటి తీర్మానాలు ప్రవేశపెట్టకుండానే సభ ముగిసింది. ఇందులో జెడ్పీటీసీ తిరుమల, ఎంపీడీవో రాధా రాథోడ్, తహసీల్దార్ సదానందంతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బడులు బాగు చేయండి

వేమనపల్లి: నిర్మాణంలో ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీపతి బాపురావు అన్నారు. మండలంలోని రాచర్ల, ముల్కలపేట పాఠశాలలను సోమవారం పరిశీలించి పనుల వివరాలను తెలుసుకున్నారు. పాఠశాలల ప్రారంభంలోపే తాగునీరు, మరుగుదొడ్ల మరమ్మతులు పూర్తి చేయాలని కోరారు.

మురుగునీటితో జనం అవస్థలు

- పట్టించుకోని అధికారులు

కోటపల్లి: మండలంలోని అన్నారం ప్రభుత్వ పాఠశాల ప్రహరీని ఆనుకొని మురుగునీరు చేరి కుంటలాగా మారడంతో దోమలకు ఆవాసంగా మారింది. గ్రామంలోని ఆ కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నామని ప్రత్యేకాధికారి, కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు తెలిపారు. వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు వెంటనే మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



అన్నారంలో ఇళ్ల మధ్య నిల్వ ఉన్న మురుగునీరు

జనావాసాల మధ్య మురుగునీరు

నెన్నెల: మండలంలోని నార్వాయిపేట ఎస్సీ కాలనీలో జనావాసాల మధ్య ఉన్న మురికినీటి గుంత దుర్వాసన వెదజల్లుతోంది. ఇలా నీరు నిలిచి పాకురు పట్టడంతో దోమలు పెరిగి అనారోగ్యానికి గురవుతున్నామని కాలనీవాసులు పేర్కొంటున్నారు. వర్షాలు పడుతుండటంతో మరింత నీరు నిలిచి చిత్తడిగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. అధికారుల దష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జనావాసాల మధ్య ఉన్న మురుగునీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



నార్వాయిపేటలో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు



రోడ్డుపై గుంతలు.. వాహనదారుల తిప్పలు



దుగ్నెపల్లికి వెళ్లే దారిలో గుంతలో నిలిచిన నీరు

చెన్నూర్‌రూరల్: మండలంలోని దుగ్నెపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి గుంతలలో నీరు నిలవడంతో రాత్రి వేళల్లో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రామంలోకి వెళ్లే రహదారిలో ఇటీవల చెరువుకట్టపై నిర్మించిన రోడ్డుపై కూడా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



చెరువుకట్ట రోడ్డుపై ఏర్పడ్డ గుంత

అస్తవ్యస్తంగా పారిశుధ్యం



ఎల్లక్కపేటలో రోడ్డుపై పారుతున్న నీరు



ఎల్లక్కపేటలో పాఠశాల సమీపంలో...

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఎల్లక్కపేట గ్రామంలో సరైన మురికి కాలువలు లేకపోవడంతో మురికి నీరు రోడ్డుపై చేరుతుంది. ప్రధాన రహదారిలో రోడ్డుపై గుంతలు ఏర్పడటం, దీనికి తోడు మురికినీరు, వర్షపు నీరంతా గుంతలలో చేరుతుంది. అలాగే ప్రభుత్వ పాఠశాల సమీపంలో ప్రకృతి వనం పక్కనే ఇళ్ల నుంచి వచ్చే మురికి నీరంతా అక్కడే చేరుతుంది. పరిస్థితి ఇప్పుడే ఇలా ఉంటే వర్షాకాలంలో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విరబూసిన మే పుష్పం

జన్నారం: మండల కేంద్రంలోని గుర్రం మోహన్‌రెడ్డి ఇంట్లో మే మాసంలో పూసే పుష్పం విరబూసింది. చుట్టుపక్కల వారు పువ్వులను చూసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.



బోర్ మరమ్మతులు చేయించండి సార్లూ..!

నస్పూర్: పట్టణ పరిధిలోని 2వ వార్డు లక్ష్మీనగర్‌లో ఓ పవర్ బోర్ నెల రోజులుగా పనిచేయడం లేదు. కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు బోర్ పని చేయడం లేదని సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి బోర్‌కు మరమ్మతు చేయించాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.



మూడేళ్లుగా మంచానికే పరిమితం

- దాతల కోసం ఎదురుచూపులు

కాసిపేట: మండలంలోని దుబ్బగూడెంకు చెందిన ఓరం కార్తీక్ అనే యువకుడు బైక్ పై నుంచి కిందపడటంతో నరాలు, వెన్నుపూస సమస్య వచ్చింది. మూడేళ్లుగా మంచానికే పరిమితమై కాలం గడుపుతున్నాడు. పేదరికంలో ఉండి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రి, కరీంనగర్ ఆస్పత్రిలలో చికిత్స తీసుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. నడుం నుంచి కింది కాళ్ల వరకు స్పర్శ లేకపోవడంతో మంచానికే పరిమితమయ్యాడు. మంచంలో పడుకొని ఉండటంతో వీపు బాగంలో తీవ్రమైన గాయం(పుండు) అయింది. కేకే ఓపెన్‌కాస్టులో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేసి కుటుంబాన్ని పోషించుకునే కార్తీక్ జీవితం, కుటుంబం ప్రమాదంతో చిన్నాభిన్నం అయింది. కులాంతర, ప్రేమ వివాహం చేసుకొని ఆదర్శంగా నిలుస్తాడు అనుకున్న అతడి జీవితం అంధకారంలో పడిపోయింది. భార్య వరలక్ష్మి ఇళ్లలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండగా పన్నెండు, పదకొండు సంవత్సరాల వయస్సు ఉన్న ఇద్దరు కుమారులు ఉన్నారు. మా నాన్నను ఆదుకొని కుటుంబాన్ని గట్టెక్కించాలని కోరుతున్నారు. మూడు సంవత్సరాలుగా మంచానికే పరిమితమైనా దివ్యాంగ పింఛన్ కూడా రావడం లేదు. ఎన్నికల ముందు ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే వినోద్ వచ్చి ఆదుకుంటానని హామీ ఇచ్చారని, తన వైద్యానికి, కుటుంబ పోషణకు ప్రభుత్వం నుంచి సాయం అందించాలని కోరుతున్నాడు. సాయం అందించాలనుకునే దాతలు ఫోన్ పే, గూగుల్ పే నంబర్ (ఓరం కార్తీక్)99599 74909కు పంపాల్సిందిగా వేడుకుంటున్నాడు.



మంచానికే పరిమితం అయిన కార్తీక్

దాతలు సహకరిస్తేనే వైద్యం

- క్యాన్సర్‌తో మంచానికే పరిమితమైన మల్లేష్

దండేపల్లి: మండలంలోని కొర్విచెల్మకు చెందిన బియ్యాల మల్లేష్‌ను గత ఐదేళ్లుగా క్యాన్సర్‌వ్యాధి పీడిస్తోంది. నిరుపేద కుటుంబం అయినప్పటికీ, వైద్యం కోసం అప్పు, సప్పో చేసి సుమారుగా రూ.4లక్షల వరకు ఖర్చు చేశారు. చికిత్స అనంతరం కొద్ది రోజులు బాగానే ఉన్నాడు. ఇటీవల మళ్లీ వ్యాధి తీవ్రత ఎక్కువయ్యింది. మళ్లీ ఆసుపత్రికి తీసుకెళ్దామంటే చేతిలో చిల్లి గవ్వలేదు. దీంతో వైద్య ఖర్చుల కోసం చాలా ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్‌లోని క్యాన్సర్ ఆసుపత్రికి నెలలో మూడు సార్లు వెళ్లాల్సి వస్తోంది. దీంతో నిరుపేద కుటుంబం కావడంతో, ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తమకు దాతలు సహకరించి, తోచిన సాయం అందించాలని మల్లేష్ వేడుకుంటున్నాడు. సాయం అందించాలనుకునే వారు ఫోన్ పే. నం : 99898 75270(గడికొప్పుల తిరుపతి)కి పంపగలరు.



మంచానికే పరిమితమైన మల్లేష్

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన డీసీవో

చెన్నూర్‌రూరల్: మండలంలోని సోమనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దుబ్బపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం డీసీవో నర్సయ్య కేంద్రాన్ని పరిశీలించారు. సెంటర్‌లో కటింగ్‌ల పేరుతో రైతులను మోసం చేస్తున్నారని రైతు ఫిర్యాదు మేరకు, రైతులతో, కేంద్రం నిర్వాహకులతో మాట్లాడారు. సెంటర్‌లో ఎలాంటి రశీదులు ఇవ్వడం లేదని రైతులు తెలిపారు. రెండు లారీల ఎకనాలెడ్జ్‌మెంట్ వచ్చాక పూర్తి స్థాయిలో పరిశీలించనున్నట్లు డీసీవో తెలిపారు. ఆయన వెంట సహకార శాఖ అసిస్టెంట్ రవికిషోర్, పీఏసీఎస్ సీఈవో రత్న లక్ష్మారెడ్డి ఉన్నారు.



దుబ్బపల్లిలో రైతులతో మాట్లాడుతున్న డీసీవో

సంక్షిప్త వార్తలు

కూలి రూ.300 పడేలా చూడాలి



జన్నారం: ప్రతి కూలికి కూలి డబ్బులు రోజుకు సరాసరి కూలీ రూ.300పడేలా చూడాలని డీఆర్‌డీవో కిషన్ అన్నారు. మండలంలోని చింతగూడ గ్రామంలోని ఫారెస్ట్‌లో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో కూలీలతో మాట్లాడి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. పని జరుగుతున్న చోట నీడ, నీటి సౌకర్యాలు కల్పించాలన్నారు.

రక్తదాన శిబిరం నిర్వహించాలి

మంచిర్యాలటౌన్: స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్లడ్‌బ్యాంకులో రక్తనిల్వలు తగ్గిపోయాయని, రక్తదాన శిబిరాలను నిర్వహించాలని రెడ్‌క్రాస్ సొసైటీ జనరల్ సెక్రటరీ చందూరి మహేందర్ సోమవారం విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్ కుమార్‌కు వినతిపత్రం అందించారు.

మే 31లోగా యూనిఫాంలు అందించాలి

జన్నారం: విద్యార్థులకు అందించే దుస్తులు మే 31లోగా అందించాలని ఎంఈవో విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మహిళా సంఘాల యూనిఫాం కుట్టు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.

కరకట్ట నిర్మాణం చేపట్టాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గోదావరి తీరం వెంబడి కరకట్ట నిర్మించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. హాజీపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సోమవారం వారు మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్‌తో పాటు, ర్యాలీవాగు పోటెత్తడంతో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాలతో పాటు హాజీపూర్ మండలం గోదావరి తీరం వైపు ఉన్న వేంపల్లి, ముల్కల్ల గ్రామాల్లోని ఇళ్లు, వ్యవసాయ భూములు నీటి మునిగి భారీగా నష్టపోతున్నారన్నారు. ముంపు నుంచి విముక్తి జరగాలంటే నిపుణుల పర్యవేక్షణలో కరకట్ట నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎనగందుల కృష్ణమూర్తి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలటౌన్: పట్టణంలోని పోచమ్మ చెరువు మత్తడి ప్రాంతాన్ని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పెద్ద ఎత్తున ధ్వంసం చేసి, కందకం తవ్వారని వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు తుల మధుసూదన్‌రావు డిమాండ్ చేశారు. మత్తడిని ధ్వంసం చేసిన ప్రాంతాన్ని సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. భూకబ్జాదారులు, రియల్ ఎస్టేట్ మాఫియాకు చెందిన వారు పోచమ్మ చెరువుని లేకుండా చేయాలనే కుట్రలో భాగంగానే మత్తడి కాలువను ధ్వంసం చేశారన్నారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ప్రభుత్వ భూములు, చెరువులను చెరపట్టకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

దండేపల్లి: స్థానికంగా ఈ నెల 17న ప్రమాదవశాత్తు టాటా ఏస్ ట్రాలీ వాహనం కాల్వలో బోల్తాపడిన ఘటనలో పలువురు ఉపాధి కూలీలు గాయపడగా, ఒకరు మృతి చెందారు. చనిపోయిన కూలీ కుటుంబానికి రూ.10లక్షలు, గాయపడ్డ కూలీలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీవో ప్రసాద్‌ను కలిసి సోమవారం వినతిపత్రం అందించారు.

రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

మంచిర్యాలటౌన్: దండేపల్లి మండలంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో 17 మంది ఉపాధిహామీ కూలీలకు గాయాలు కాగా, అందులో ఒక మహిళా కూలీ సోమవారం మృతి చెందిందని, ఆ కూలీ కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియాను చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కోరారు. ఈ సందర్భంగా డీఆర్డీవో ఐఏఎస్ అధికారిని అనిత రామచంద్రంతో ఫోన్‌లో మాట్లాడి ఎక్స్‌గ్రేషియాను చెల్లించేలా చూడాలని కోరారు.

కమిటీ ఎన్నిక

దండేపల్లి: మండలంలోని చింతపల్లి గ్రామ రజక సంఘం యువజన కమిటీని సోమవారం ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్కూరి రాజన్న, మండల అధ్యక్షుడు పుట్టపాక తిరుపతి తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా ఇందూర్, అధ్యక్షుడిగా రమేష్ ఎన్నికయ్యారు.

బొగ్గుబాయి వార్తలు

సేల్ పికింగ్ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న బ్రహ్మానందం

మందమర్రిరూరల్: ఏరియాలోని సేల్ పికింగ్ కార్మికులకు ఐదు నెలలుగా రావాల్సిన బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం డిమాండ్ చేశారు. ఏరియా జీఎం ఆఫీస్ వద్ద సోమవారం ఆందోళన నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. సేల్ పికింగ్ కాంట్రాక్టర్ తక్కువ కోడ్ చేసి కాంట్రాక్ట్ దక్కించుకున్నాడనే సాకుతో, కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. దీంతో సేల్ పికింగ్ కార్మికులు ఆర్థికంగా జీవనోపాధి లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కార్మికులకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించి, ప్రతి నెలా చెల్లించాల్సిన వేతనాలు 7వ తేదీలోగా చెల్లించాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు మహేశ్వరరావు, శ్రీనివాస్, మల్లేష్, కార్తీక్, సతీష్, కిష్టయ్య, శంకర్, ఓదెలు ఉన్నారు.

ఏరియాలో కొత్త గనులు ఏర్పాటు చేయాలి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో నూతనంగా కేకే–6, శ్రావణపల్లి ఉపరితల గనులను ఏర్పాటు చేయాలని హెచ్చెమ్మెస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఏరియాలోని హెచ్చెమ్మెస్ ఆఫీస్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో రియాజ్ మాట్లాడారు. ఏరియాలోని గనులకు జీవితకాలం ఉన్నప్పటికీ ఓసీలుగా మార్చాలనే దురాశతో మూసివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్కే ఓసీ ప్లానింగ్, ప్రణాళిక లేకుండా నిలిపివేయడమేంటని సర్వే ప్లానింగ్ లోపాలకు కారణమైన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఏరియాలో కొత్త గనులు లేకుంటే ఏరియాకు భవిష్యత్ లేదని, కొత్త గనులు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణప్రసాద్, ప్రెసిడెంట్ నారాయణ, ఏరియా వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, నాయకులు సుదర్శన్ రామస్వామి, అనీల్‌రెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వినతి

చెన్నూర్‌రూరల్: మండలంలోని లంబడిపల్లి గ్రామ సమీపంలో సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ పవర్ ప్లాంట్‌లో స్థానిక నిరుద్యోగ యువకులకు కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని లంబడిపల్లి యువకులు శ్రీరాంపూర్ ఏరియా మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 2002 నుంచి గ్రామంలో సుమారు 42ఎకరాల భూమి సింగరేణికి ఇచ్చినట్లు, ఇక్కడ చదువుకున్న నిరుద్యోగ యువతకు ఏర్పాటు చేస్తున్న సోలార్ పవర్‌ప్లాంట్‌లో ఉద్యోగాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో చెన్నూర్ మండల ఎస్టీ యూనియన్ ప్రెసిడెంట్ నగావత్ మహేష్ పాల్గొన్నారు.



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న లంబడిపల్లి యువకులు